వరినాట్లకు వరుణగండం

- తుపాను హెచ్చరికతో రైతుల బెంబేలు
- ఇప్పటికే ఒకసారి దెబ్బతిన్న నాట్లు
- రెండోసారి వేస్తున్న వైనం
- ఈసారి మునిగితే ఖరీఫ్ కష్టమే..



చినకొండేపూడి - చీపురుపల్లి మధ్య పొలంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

సీతానగరం: ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగు చేపట్టిన రైతులకు కాలం కలిసిరాలేదు. నాట్లు వేసింది మొదలు వాతావరణం అనుకూలించడం లేదు. జూలైలో ఎంతో ఉత్సాహంగా వరినాట్లు వేసిన 15 రోజులకే వరుణుడు విశ్వరూపం చూపించాడు. ఎడతెరిపి లేకుండా వారం, పది రోజుల పాటు వాన కురిపించాడు. దీంతో పొలాలు ముంపు బారిన పడ్డాయి. గోదావరికి వరద రావడంతో ఎక్కడికక్కడ పంటలు మునిగిపోయాయి. గోదావరిలో కలిసే వీలులేక కాలువలు వెనక్కి ప్రవహించాయి. దీంతో పొలాలన్నీ చెరువుల్లా మారాయి.

రెండోసారి నాట్లు

జూలై నెలలో కురిసిన వర్షాలకు ముంపులోకి వెళ్లిన కొన్ని వందల ఎకరాలు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. నీరు లాగిన పొలాల్లో నాట్లు దెబ్బతిన్నాయి. దీంతో రెండోసారి వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఆకుమడిని సేకరించుకుని మళ్లీ సాగుకు సమాయత్తమయ్యారు. కొన్నిచోట్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అయితే మరోసారి తుపాను హెచ్చరికలు రావడంతో కంగారు పడుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు కూడా కురుస్తున్నాయి. వాతావరణం ఇలాగే కొనసాగితే ఇప్పుడు వేస్తున్నవరినాట్లు కూడా దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. ఈసారి కూడా ముంపు సమస్య ఏర్పడితే ఇక రబీ వరకూ సాగు చేయలేమని స్పష్టం చేశారు.

కొండ గోదారి ఎగపోటు

జూలైలో గోదావరి వరదతో బొబ్బిల్లంక వద్ద స్లూయిజ్ నుంచి కొండ గోదావరి నీరు తరలివెళ్లే అవకాశం లేకపోవడంతో ఎగపోటు పట్టింది. దీనితో కోరుకొండ మండలంలో మూడు వేలు, సీతానగరం మండలంలో 9 వేల ఎకరాలు ముంపులోకి వెళ్లాయి. వాటిలో కొన్ని పొలాలు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. గోకవరం, కోరుకొండ మండలాలలో కొన్ని గ్రామాలలో కురిసిన వర్షం నీరు, సూరంపాలెం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన మిగులు జలాలన్నీ బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకున్నాయి. అక్కడి నుంచి బొబ్బిల్లంక స్లూయిజ్ తలుపులు నుంచి గోదావరిలో కలవాలి. అయితే గోదావరికి వరద వస్తే స్లూయిజ్ తలుపులు మూసుకుపోతాయి. దీంతో కొండ గోదారి నుంచి వెనక్కి తన్ని పొలాలను ముంచెత్తుతోంది.

ముమ్మరంగా వరినాట్లు

జూలైలో కురిసిన వర్షాల కారణంగా ముంపులోకి వెళ్లిన పొలాల్లో ఆరు వేల ఎకరాలు ముంపు నుంచి బయటపడ్డాయి. వాటిలోని రెండు వేల ఎకరాల్లో రెండోసారి వరినాట్లు వేసే ప్రయత్నంలో రైతులు ఉన్నారు. కొందరు మెరక పొలాల్లో వరినారు మడులు కట్టి తమ పంటపొలాల్లో వరినాట్లు వేస్తున్నారు. మరికొంతమంది రైతులు ఎకరానికి రూ.5 వేలు ఖర్చు చేసి వరి ఆకును కొనుగోలు చేస్తున్నారు.

ఖరీఫ్ లేనట్టేనా..

జూలైలో ముంపులోకి వెళ్లిన 9 వేల ఎకరాల్లో 6 వేల ఎకరాలు బయటపడ్డాయి. ఇంకా మూడు వేల ఎకరాలు అలాగే ఉన్నాయి. ముంపు నుంచి బయటపడ్డ పొలాల్లో రెండు వేల ఎకరాల్లో రెండోసారి వరినాట్లు వేశారు. మిగిలిన నాలుగు వేల ఎకరాల్లో పలుసగా వరినాట్లు వేశారు. కోరుకొండ మండలంలో మూడు వేల ఎకరాలు ముంపులోకి వెళ్లగా వెయ్యి ఎకరాలు అలాగే ఉన్నాయి. సీతానగరం మండలం చినకొండేపూడిలో 500, సింగవరంలో 100, రఘుదేవపురంలో 300, నల్గొండలో 400 ఎకరాలతో పాటుగా మిగిలిన గ్రామాల్లో 1,700 ఎకరాలు ముంపు నుంచి బయటపడలేదు. దీంతో అక్కడ ఖరీఫ్ సాగు లేనట్టేనని రైతులు చెబుతున్నారు. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రబీలో మొక్కజొన్న పంటలు వేయాల్సిందేనన్నారు.

రైతులను మొండిచెయ్యి

ముంపునకు గురైన పొలాల రైతులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొండిచెయ్యి చూపించింది. కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ (రైతు భరోసా) నగదు వేస్తామని చెప్పినా ఇప్పటికీ అమలు చేయలేదు. ముంపులోకి వెళ్లిన పొలాల నివేదికను వ్యవసాయశాఖాధికారులు అందించినా దానిపై ఎటువంటి ప్రకటనలు చేయలేదు.

అంతా నష్టమే..



ఏడు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి పంట వేశాను. ఎకరానికి రూ.15 వేలు చొప్పున ఖర్చు చేశాను. కొండ గోదావరి ఎగపోటుతో జూలైలో వరి పంట నాశనమైంది. ఇప్పుడు వరిఆకు దొరకడం కష్టంగా ఉంది. కొంత ఆకుమడి వేశాను. సరిపోలేదు. బయట కొనుగోలు చేశాను. ఎకరానికి రూ.5 వేలతో కొనుగోలు వేసి వరినాట్లు వేశాను. మళ్లీ ఇప్పుడు తుపాన్ అంటున్నారు. ఏమి చేయాలో తెలియడం లేదు.

– సూలా దుర్గారావు, కౌలు రైతు లంకూరు

ఖరీఫ్ సాగు సాధ్యం కాదు



సీతానగరం మండలంలో తొమ్మిది వేల ఎకరాలు వరి పొలాలు ముంపులోకి వెళ్లాయి. ఇందులో ఆరువేల ఎకరాలు బయటపడ్డాయి. వాటిలోని రెండు వేల ఎకరాల్లో రెండోసారి వరినాట్లు వేశారు. మిగిలిన మూడువేల ఎకరాలు ముంపు నుంచి బయటపడలేదు. నీరు లాగడానికి సమయం పడుతుంది. ఖరీఫ్ పంట వేయడం సాధ్యం కాదు. ఇక అక్టోబర్‌లో రబీ సాగు చేపట్టాలి. పంటనష్టం నివేదికను పైఅధికారులకు అందించాం. రెండు నెలల్లో ప్రభుత్వం నుంచి పరిహారం అందే అవకాశం ఉంది.

– జొన్నలగడ్డ సత్యనారాయణ, రైతు, మిర్తిపాడు

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

రాజానగరం: తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా ఈ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ కింద తెలిపిన నంబర్లలో సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

రాజానగరం	91826 48034
సీతానగరం	62818 67443
కోరుకొండ	99086 82953
గోకవరం	94923 42353
రంగంపేట	70952 39456
అనపర్తి	90006 60657
బిక్కవోలు	98664 84845

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



బిక్కవోలులో..



చంద్రేడులో..

బిక్కవోలు: స్థానిక పార్కు వీధిలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శ్రావణ మాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాధురికి పీహెచ్‌డీ ప్రదానం



ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న మాధురి సంతోషి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్‌లో పెదిరెడ్ల మాధురి సంతోషికి పీహెచ్‌డీని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు శనివారం అందజేశారు. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న రాజమండ్రి ప్రభుత్వ కళాశాల నుంచి మాధురి సంతోషి 'రేర్ ఎర్త్ మెటల్ డోప్ట్ ఇన్ ఆర్గానిక్ క్రిస్టల్స్ ఫర్ ఆప్టికల్ అండ్ యాంటీమైక్రోబియల్ ఇన్వెస్టిగేషన్స్' అనే అంశంపై పరిశోధనను సమర్పించారు. డాక్టర్ కె.రామచంద్రరావు పర్యవేక్షణలో ఆమె ఫుల్ టైమ్ పీహెచ్‌డీ చేశారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



పెద్దాడలో అనాథ శరణాలయానికి చెక్కు అందజేస్తున్న మురళీకృష్ణ

పెదపూడి: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని కరకుదురు గ్రామానికి చెందిన సేవకీయం చారిటబుల్ ట్రస్ట్ అధినేత తలాటం మురళీకృష్ణ అన్నారు. పెద్దాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీరబ్బాయి అనాథ శరణాలయానికి శనివారం ఆయన రూ.1.50 లక్షల విరాళం అందించారు. కరకుదురు గ్రామానికి చెందిన దివ్యాంగుడు నర్ల సాయిబాబాకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ పేదలు, అనాథలను ఆదుకోడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాటంశెట్టి వెంకటేష్, పాఠంశెట్టి చక్రి, నక్కా సిద్ధు, కొండపల్లి నరేష్, బూదేటి స్వామి, ఆకుల బాలు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం



బిక్కవోలులో సాయిబాబా

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో ఊలపల్లి రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయ 3వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు వైజాగ్ అబ్బు, పాలచర్ల రామకృష్ణాచౌదరి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం కాక హారతి, పంచామృత అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కావున అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబావారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించాలి



చంద్రరావు దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ తులసి

పెదపూడి: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిస్వార్థ సేవలందించాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన చిట్టూరి చంద్రరావుకు అభినందన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వహించేవారు ప్రజాదరణ పొందుతారన్నారు. అనంతరం చంద్రరావు దంపతులకు ఆమె దుశ్శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఏఓ చలమయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సత్యనారాయణ, ఏఈ కాంచన, సిబ్బంది రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



రాజానగరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులను, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో మ్యూటేషన్‌కు సంబంధించిన మ్యూటేషన్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లో సిబ్బందికి విధులను కేటాయించాలని తహసీల్దార్ లక్ష్మీలావణ్యను ఆదేశించారు. అనంతరం సామాజిక పింఛన్ల పంపిణీ ప్రగతిపై ఎంపీడీఓతో సమీక్షించారు.

రామేశంపేటలో జ్వరాలపై సర్వే



వైద్య శిబిరంలో రోగులను పరీక్షస్తున్న డాక్టర్ చిన్నారావు

రంగంపేట: మండల పరిధిలోని రామేశంపేట గ్రామంలో జ్వరాలపై శనివారం సర్వే నిర్వహించినట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఫీవర్ సర్వే చేసి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి జ్వరం, దగ్గు, జలుబుతో బాధ పడుతున్నవారిని గుర్తించి మందులు అందించామన్నారు. అవసరమైన వారిని పీహెచ్‌సీకి తరలించి టెస్టులు చేయించామని చెప్పారు. అలాగే అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

మహిళా కారాగారం సందర్శన

కంబాలచెరువు: సెంట్రల్ జైలులోని మహిళా కారాగారాన్ని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చట్టంతో విభేదించిన బాలలను గుర్తించి, న్యాయస్థానాల ముందు వారి బాల్యాన్ని నిరూపించుకోవడానికి అవసరమైన చట్టపరమైన సహాయాన్ని అందించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వారు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పారా లీగల్ వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుని న్యాయ సహాయం పొందవచ్చన్నారు.

సారా విక్రేతకు రిమాండ్

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన పీత వీరన్నకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ బొబ్బిల్లంక ఏటిగట్టుపై సారా విక్రయిస్తుండగా వీరన్నను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.

వర్షంతో రాకపోకలకు అవస్థలు



పశ్చిమగానుగూడెం వద్ద హైవేపై ప్రవహిస్తున్న నీరు

మధురపూడి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ తెరిపివ్వకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రహదారులపైకి నీరు చేరడంతో ప్రయాణానికి ఇబ్బంది కలుగుతోంది. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వెళ్లే 516 ఈ జాతీయ రహదారిపై నీరు ప్రవహించింది. కోరుకొండ మండలం గాడాల పొన్నాలమ్మ ఆలయం బూరుగుపూడి కొత్తూరు చర్చి ఎదురుగా, కోరుకొండ బస్టాండ్ సెంటర్, పశ్చిమగానుగూడెం, కొంతమూరు – కోలమూరు మధ్యలో, గామన్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోయింది. శ్రీరంగపట్నం – కోటికేశవరం – బొల్లెద్దుపాలెం రోడ్లపైకి నీరు చేరింది.

సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ



పొలమూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పెదపూడి మండలంలో 10,582 సామాజిక పింఛన్లకు గాను 9,819 మందికి శనివారం పింఛన్లు పంపిణీ చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. అలాగే రంగంపేట మండల వ్యాప్తంగా 8,925 మంది పింఛన్లకు గాను శనివారం 8668 పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ పి.వెంకటరత్నం శనివారం వెల్లడించారు. బిక్కవోలు మండలంలో 10,696 పింఛన్లకు గాను 10,219 పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు.

కోరుకొండ మండలంలో...

మధురపూడి: శ్రీరంగపట్నం, కోటికేశవరం గ్రామాల్లో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు. మండలంలోని 12,374 మంది లబ్ధిదారులకుగాను 12,064 మందికి రూ.5,31,96,500 అందజేశారు. తొలిరోజు దాదాపు 98 శాతం పంపిణీ పూర్తయ్యింది.

13 నుంచి జీజీయూలో మేథ ఉత్సవాలు



మేథ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

రాజానగరం: ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో సెప్టెంబరు 13 నుంచి మేథ ఉత్సవాలను నిర్వహించనున్నామని రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్స్, ఇంట్రాక్టివ్ వెబ్ డిజైన్, రోబోరేస్, టెక్నికల్ క్విజ్, టెక్నికల్ టాక్స్, ఫిలిం మేకింగ్, ట్రెజర్ హంట్‌తో పాటు స్పాట్ ఈవెంట్స్ ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలవారు ఈ నెల 10వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాగా..జీజీయూలోని ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగాన్ని కాకినాడ జేఎన్‌టీయూ విద్యార్థులు శనివారం సందర్శించారు. ఏఎంఈ వర్క్‌షాప్‌లో తక్కువ ఖర్చుతో గైట్ విద్యార్థులు తయారుచేసిన ఎలక్ట్రిక్, బ్యాటరీ వాహనాల గురించి హెచ్‌ఓడీ డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం ద్వారా తెలుసుకున్నారు.

టీచర్ గంగారత్నం సేవలు అభినందనీయం



గంగారత్నం దంపతులను సన్మానిస్తున్న సహచరులు

రాజానగరం: ఎందరో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించి, వారికి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన టీచర్ గంగారత్నం సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. నరేంద్రపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఫరిజల్లిపేటకు చెందిన గంగారత్నం శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గంగారత్నం దంపతులను స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సహచరులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. కాగా.. తమపై అభిమానంతో కార్యక్రమానికి తరలివచ్చిన బంధువులు, సహచరులు, స్నేహితులందరికీ గంగారత్నం దంపతులు గులాబీ మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, మండలానికి చెందిన ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

విద్యార్థుల మదిలో చెరగని ముద్ర



వీరభద్రరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

బిక్కవోలు: 27 ఏళ్లుగా విలువలతో కూడిన విద్యనందిస్తూ విద్యార్థుల మదిలో చెరగని ముద్ర వేసుకున్న ఉపాధ్యాయుడు వీరభద్రరావు అని ఎంఈవో–1 సీహెచ్‌వీ సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని ఇలపల్లి ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన తేలుగుంట్ల వీరభద్రరావును గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లొల్లం భద్రం, తణుకు శ్రీధర్, కానేటి అప్పలస్వామి, సాధనాల రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ డి.నరసింహ కిశోర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి, నమోదైన గ్రేవ్ కేసులపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. బ్లూకోల్ట్స్, రక్షక్ మొబైల్ గంట గంటకూ తమ లొకేషన్ మార్చుకుంటూ అప్రమత్తంగా తిరుగుతూ కంట్రోల్ రూమ్‌కు తెలిపాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. అక్రమ మద్యం, గంజాయి, సారా రవాణాను నియంత్రించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సురక్షిత భవనాలకు హాస్టల్ విద్యార్థుల తరలింపు

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఆరు సంక్షేమ వసతి గృహాలలో ఉన్న విద్యార్థులకు పక్క భవనాల్లో తాత్కాలిక వసతి కల్పించినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు ఎస్సీ, రెండు బీసీ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు సురక్షిత భవనాలలో తాత్కాలిక బస ఏర్పాటు చేశామన్నారు. రాజానగరం బీసీ కాలేజీ బాలుర వసతి గృహంలోని 60 మందిని రాజమహేంద్రవరం కంబాలచెరువు వై.జంక్షన్ సమీపంలోని బీసీ వసతి భవనంలోకి, అలాగే కోరుకొండ బీసీ కాలేజీ బాలికల వసతి గృహంలోని 17 మంది బాలికలను రాజమహేంద్రవరంలోని బీసీ బాలికల వసతి గృహానికి తరలించామన్నారు. అలాగే నల్లజర్ల ఎస్సీ సంక్షేమ వసతి గృహంలోని 37 మంది, కోరుకొండలో 25 మంది, కొవ్వూరులో 35 మందిని సమీపంలోని ఎంపీపీ స్కూళ్లలోకి, ఉండ్రాజవరంలో 27 మందిని సమీపంలోని ప్రైవేటు భవనంలోకి మార్పు చేసినట్టు తెలిపారు. గతంలో ముంపు ప్రభావిత ప్రాంతాలలో ఆయా వసతి గృహాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో ముందస్తు భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ముంపు నివారణలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో సిల్ట్‌ను తక్షణం తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శానిటేషన్, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలను జారీ చేశామన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఆదివారం కూడా మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు.

గిరిజనులపై ప్రభుత్వం చిన్నచూపు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్

కంబాలచెరువు: జామిగుడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 79 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో దానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక మావోభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గిరిజనులపై చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమన్నారు. వనం – మనం కార్యక్రమాల మీద ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉన్న దృష్టి.. సంక్షేమ హాస్టల్‌పై లేకపోవటం సిగ్గుచేటన్నారు. మొక్కలకు ఇచ్చే విలువ విద్యార్థుల ప్రాణాలకు ఇవ్వరా అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి దీనిపై నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులను తొలగించడం అన్యాయం

రాజమహేంద్రవరం సిటీ: రైల్వేలో 25 ఏళ్లుగా బాక్స్ బాయ్స్‌గా పనిచేస్తున్న కార్మికులను పనుల నుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు అన్నారు. వారిని వెంటనే పనిలోకి తీసుకోవాలని, లేని పక్షంలో రైల్వేలో వేరే పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల తొలగింపునకు నిరసనగా శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో నిరసన తెలిపారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధ)శాఖ కార్యదర్శి బి.శ్రీనివాస్, బాక్స్ బాయ్స్ పాల్గొన్నారు.

విద్యుత్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలి



శ్రీధర్ వర్మ, ఈఈ

మధురపూడి: వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆయన శనివారం కోరుకొండలో విలేకరులతో మాట్లాడుతూ తడిచి చేతులతో స్టార్టర్లు, మోటార్లు, స్విచ్ బోర్డులు పట్టుకోకూడదని, తడిచిన విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. విద్యుత్ తీగలకు తగిలే చెట్లను ముట్టుకోకూడదని సూచించారు. తీగలు తెగినా, కొమ్మలు విరిగిపడినా సంబంధితశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చేటప్పుడు డిష్ కనెక్షన్ తీసేయాలని, కంప్యూటర్లు, టీవీ, ఫ్రిడ్జ్ స్విచ్‌లను ఆపేయాలన్నారు.